ప్రజాశక్తి
సోమవారం 29 జనవరి 2024
5
కర్నూలు

జిల్లా అభివృద్ధికి చర్యలు

- వైసిపి ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారు
- పత్తికొండ 'రా కదలి రా' బహిరంగ సభలో చంద్రబాబు

బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

బహిరంగ సభలో నాగలితో చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - పత్తికొండ

తాము అధికారంలోకి రాగానే జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. వైసిపి ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారని విమర్శించారు. పత్తికొండ ఎమ్మెల్యే మాఫియాకు అధినేత్రి అని, అనకొండ మాదిరి మేస్తున్నారని ఆరోపించారు. జయరాంను ఆలూరు నుండి ప్యాక్ చేసి ఎంపీ అభ్యర్థిగా ప్రకటిస్తే ఎంపీ సీటు వద్దని పారిపోయాడని అన్నారు. ఆదోని ఎమ్మెల్యేవి ఎక్కడ చూసినా భూకబ్జాలేనని, మట్కా, క్రికెట్ బెట్టింగ్‌లో దిట్ట అని అన్నారు. మంత్రాలయం ఎమ్మెల్యే ఇసుకను మింగేస్తున్నారని, చెరువును ఆక్రమించుకున్నారని, కర్ణాటక మద్యం తెచ్చి వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే దేవాదాయ భూములు కొట్టేసారని, ఆయన్ని ఇంటికి పొమ్మన్నారని తెలిపారు. కోడుమూరులో పెత్తనం అంతా షాడో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిదన్నారు. కర్నూలు ఎమ్మెల్యే అవినీతిలో కింగ్ కాంగ్ అని అన్నారు. ఇలాంటి ఎమ్మెల్యేలు మనకు అవసరమా అని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. ఆదోనిలో మిర్చియార్డు, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లాలో విండ్, సోలార్ విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. హంద్రీనీవా ద్వారా అన్ని చెరువులకు నీళ్లు ఇస్తామన్నారు. కర్నూలు జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ పెడతామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు బీటి నాయుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి కేయి కృష్ణమూర్తి, మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, మాజీ మంత్రులు అఖిల ప్రియ, పల్లె రఘునాథ రెడ్డి, నాయకులు కెయి ప్రభాకర్, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి నియోజకవర్గ ఇంచార్జీలు కెయిశ్యామ్‌బాబు, పి.తిక్కారెడ్డి, కోట్లసుజాతమ్మ, మీనాక్షి నాయుడు, ప్రభాకర్, బివి.జయనాగేశ్వర్ రెడ్డి, జనసేన కర్నూలు జిల్లా కన్వీనర్ చింతా సురేష్, నియోజకవర్గ ఇంచార్జీలు రాజశేఖర్, రేఖ గౌడ్ పాల్గొన్నారు.

వలసల నివారణకు నిర్దిష్ట ప్రణాళిక

- కోటిపని దినాలు కల్పించడమే లక్ష్యం
- ఉపాధి హామీ కింద రూ.230 కోట్లు ఖర్చు
- ప్రజాశక్తితో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ అమర్‌నాథ్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన కూలీలందరికీ పనులు కల్పిస్తున్నాం. జిల్లా పశ్చిమ ప్రాంతంలో పూర్తిస్థాయిలో వలసలు నివారణకు నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించాం. ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపుగా కోటి పని దినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టున్నాం. ఇప్పటికే ఉపాధి హామీ చట్టం కింద దాదాపు రూ.230 కోట్లు ఖర్చు చేశాం. ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నాం. అని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. ఆయన ప్రజాశక్తికి ముఖాముఖిలో పలు అంశాలను వెల్లడించారు.

కర్నూలు జిల్లాలో ఉపాధి కూలీల వలసలు నివారణకు చర్యలు ఏమిటి?

పిడి: జిల్లాలో ఆదోని పశ్చిమ ప్రాంతంలో వలసలను అరికట్టేందుకు ఇప్పటికే అన్ని చర్యలు చేపట్టాం. ఉపాధి కూలీలు వలసలు వెళ్తున్న గ్రామాలను గుర్తించి వారికి ఉపాధి హామీ పథకం పనులపై అవగాహన కల్పిస్తున్నాం. గత డిసెంబర్ నెల నుండి పనులు కూడా ప్రారంభించాం. గ్రామాల్లో అడిగిన ఉపాధి కూలీలందరికీ పనులు పెట్టాలని స్పష్టమైన ఆదేశాలను జిల్లా కలెక్టర్ కూడా జారీ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలి.

ఉపాధి కూలీలకు చేసిన పనులకు వేతనాలు సరిగ్గా అందడం లేదని అంటున్నారు దీనిపై మీ స్పందన?

పిడి: ఉపాధి కూలీలు పనులకు వచ్చిన రోజు నుండి వారు ఎంతవరకు పనిచేశారో అన్ని వివరాలను నమోదు చేసి రెండు వారాల్లోగా వారు బ్యాంకు ఖాతాల్లో కూలి డబ్బులు జమ చేస్తామన్నారు. కర్నూలు జిల్లాలో ఇప్పటికే దాదాపుగా 87 లక్షల ఉపాధి పని దినాలను కల్పించాం. వీటితోపాటు ఉపాధి కూలీలకు రూ.230 కోట్ల నిధులను కూడా ఖర్చు పెట్టాం. ఉపాధి కూలీలకు రోజు వారిగారూ రూ.268 అందుతుంది.

ఉపాధి పనులు అక్కడక్కడ కొన్ని ప్రాంతాల్లో సరిగ్గా జరగడం లేదు? అలాంటి వాటిని గుర్తించారా?

పిడి: ఉపాధి పనులను అన్ని గ్రామాల్లో పెట్టాలని ఇప్పటికే తమ క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. అన్ని గ్రామాల్లో పనులు పెట్టాలని రోజువారీగా సమీక్షలు నిర్వహిస్తున్నాం. పనులను సరిగ్గా చెప్పటం లాంటి సిబ్బందికి క్రమశిక్షణ చర్యలు తీసుకోవడమే గాక వారికి కౌన్సిలింగ్ కూడా ఇస్తున్నాం.

జిల్లాలో అమృత్ సరోవర్ పథకం కింద ఎన్ని చెరువులను అభివృద్ధి చేశారు?.

పిడి: జిల్లాలో 81 చెరువులను ఈ కార్యక్రమం కింద అభివృద్ధి చేశారు. పురాతన నిరుప యోగంలో ఉన్న చెరువులన్నిటిని గుర్తించి అభివృద్ధి చేశాం. చెరువుల చుట్టూ ఒక ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పాం. ఈ కార్యక్రమం అమలు చేసేందుకు రూ 3.65 కోట్లను కూడా ఖర్చు చేశాం.

కన్నీటి జీవితమే నా కవిత్వం

- కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు బెల్లంకొండ ప్రసేన్ - ఘనంగా అక్షరం-2024 పురస్కార ప్రదానం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

జీవితంలో కష్టాలు కన్నీళ్ళు ప్రవహించాయని కన్నీటి జీవితమే కవిత్వమైందని కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు ప్రముఖకవి, విమర్శకులు బెల్లంకొండ ప్రసేన్ అన్నారు. ప్రముఖకవి కాశీభట్ల వేణుగోపాల్ స్థాపించిన అక్షరం లిటరరీ ట్రస్ట్ అందించే ప్రతిష్టాత్మక అక్షరం-2024 పురస్కారం నగరంలోని మాంటిస్సోరి ఏక్యాంప్ పాఠశాలలో ఆయన అందుకున్నారు. కథారచయిత మారుతీ పౌరోహితం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కవికి మెదడు కవిత్వసారమని, కవిత్వ రూపం భౌతికమని అన్నారు. కవి తన అనుభూతులను ప్రపంచం మీద రుద్దడం కాదన్నారు. విమర్శకులు కవిత్వ విమర్శను ఒకవైపు మాత్రమే చూస్తారని, అలా చూడటం సరికాదన్నారు. అనుకున్నది అనిపించినది నిష్కర్షగా చెప్పినపుడు మాత్రమే కవిత్వవిమర్శ అన్నారు. కవిత్వం ఎలాగ చదవాలో కూడా కవికి తెలియాలని అన్నారు. సినిమా సమీక్షలు సాహిత్యమేనని, కవిత్వం కంటే ఎక్కువ ప్రయోజనం సినీమాకు ఉందన్నారు. కవిత్వమంటే ఉల్లాసం ఆనందం కలిగించడం కాదని కవిత్వంలో తాత్వికత చెప్పగలగాలన్నారు. ప్రసేన్ కవిత్వాన్ని పరిచయం చేసిన కవి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రసేన్ కవిగా విమర్శకుడుగా అనేక ప్రయోగాలు చేశాడన్నారు. కవిత్వరూపం విషయంలో ఆయన వందేళ్ళు ముందుంటారన్నారు. ఇవాల్టి గాజాఘటనల్ని దాదాపు 30 ఏళ్ళ క్రితమే పదునైన వాక్యాలుగా చెప్పడం ఆయనకు మాత్రమే సాధ్యమందన్నారు. ప్రపంచాన్ని లోతుగా చూసి కవిత్వాన్ని రాయడం కొందరికే సాధ్యమైతుందన్నారు. సభాధ్యక్షులు మాట్లడుతూ కవిగా పదనెక్కినవాక్యాలు అర్థవంతమైన ప్రయోగాలు చేయడంలో ప్రసేన్‌లాంటి కవులు సాహిత్యలోకంలో అరుదుగా కనిపిస్తారన్నారు. అక్షరం ట్రస్ట్ వ్యవస్థాపకులు కాశీభట్ల వేణుగోపాల్ మాట్లాడుతూ కవిగా ప్రసేన్ తనకు శకలాలు శకలాలుగా మాత్రమే పరిచయమని, కవిగా కంటే ఆయన మనిషిగా గొప్పవాడన్నారు. కవిత్వంలో ప్రసేన్‌కు మాత్రమే చెందిన ఒక ప్రత్యేకత ఉంటుందని జిద్దుకృష్ణమూర్తి చెప్పినట్లు ప్రత్యేకమైన తనదైన ఏకాంతం ఉంటుందన్నారు. ప్రముఖవైద్యులు డాక్టర్ ఉమానాథరావు మాట్లాడుతూ కాశీభట్ల వేణుగోపాల్ కవిగా భాషా సాహిత్యాలకు జీవం పోస్తున్నారన్నారు. సభలో ప్రముఖవైద్యులు క్రిష్ణమోహన్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, విరసం నాయకులు నాగేశ్వరాచారి, కథారచయిత్రులు డాక్టర్ ఎం.ప్రగతి, కల్యాణదుర్గం స్వర్ణలత, కవులు టి.వెంకటేష్, ఇనాయతుల్లా, కవయిత్రి స్వయంప్రభ, సిఐ శ్రీనాథ్‌రెడ్డి, సాహిత్యాభిమానులు విశ్వనాథరెడ్డి, ఎవి రెడ్డి పాల్గొన్నారు.

ప్రసేన్ కుమార్‌కు అక్షరం పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న అతిథులు

దోమల నివారణ చర్యలు చేపట్టాలి

- నేడు మున్సిపల్ ఆఫీస్ ముందు సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నెల రోజులుగా కర్నూలు నగర ప్రజలపై దోమలు దండయాత్ర చేస్తున్నాయని, దోమలను అరికట్టడంలో ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సోమవారం ఉదయం 10 గంటలకు సిపిఎం ఆధ్వర్యంలో కర్నూలు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె .సుధాకరప్ప, ఆర్. నరసింహులు నగర కమిటీ సభ్యులు జి .ఏసు, జె.శ్రీనివాసులు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కర్నూలు నగరానికి చుట్టుప్రక్కల ఉన్న హంద్రీ నది, వక్కెర వాగు, సుద్ద వాగు, తుంగభద్ర నది, కెసి కెనాల్ లలో చెత్తాచెదారం పేరుకు పోయి మురికి నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు అక్కడ నివాసం చేస్తూ రాత్రి అయిందంటే కర్నూలు నగరమంతా దోమల వ్యాపించి మనుషులను ఇంటి నుంచి బయటకు రానీయకుండా దాడి చేస్తున్నాయని వాటి వల్ల ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారన్నారు. వాటిని అరికట్టడంలో మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం గా వ్యవరించడం పట్ల ప్రజారోగ్యం ఎలా కాపాడతారని ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు వార్డులలో కాలువలను శుభ్రం చేయడంలో , కాలువల లో బ్లీచింగ్ పౌడర్ కానీ హైపో ద్రావణాన్ని పిచికారి చేయడంలో , రాత్రిపూట ఫాంగింగ్ చేయడంలో పూర్తిగా వైపల్యం చెందారన్నారు. దీంతో దోమలు విపరీతంగా వ్యాపిస్తున్నాయనితెలిపారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ధర్నాలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

జాబ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఎంఏ.హఫీజ్‌ఖాన్

1న కర్నూలులో జాబ్ మేళా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరి 1న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పేర్కొన్నారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాకు సంబంధించి కరపత్రాలను హఫీజ్ ఖాన్ ఆవిష్కరించారు. ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8374231357, 8309283980, 6300009183, నంబర్లను సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి. శ్రీకాంత్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-మద్దికేర

చంద్రబాబు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మద్దికేర మండల టిడిపి యువ నాయకులు ఆకుల వేణుగోపాల్ అన్నారు. ఆదివారం పత్తికొండ రా కదిలిరా బహిరంగ సభకు యడవలి నుంచి దాదాపు 100 మందితో ఆయన కదిలి వెళ్లారు. ఆయన మాట్లాడుతూ రా కదిలిరా బహిరంగ సభ విజయవంతం కావడంతో వైసిపి ప్రభుత్వానికి వణుకు పుట్టిందన్నారు. సభకు వచ్చిన జనం చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో వైసిపి కొట్టుకోవడం ఖాయమన్నారు. పంచాయతీ సలహాదారుడు నంది జయరాముడు యువ నాయకుడు సంజీవ రాయుడు వెంకటరాముడు సోమశేఖర్ పాల్గొన్నారు.

8న ఆశవర్కర్ల చలో విజయవాడ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్ల సమస్యలపై ఫిబ్రవరి 8న చలో విజయవాడకు తరలిరండని సిఐటియు జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు ,ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి కార్మికులకు పిలుపునిచ్చారు. ఎపి ఆశా వర్కర్ల జిల్లా కమిటీ సమావేశం రమీజాబీ అధ్యక్షతన కర్నూలులో కార్మిక కర్షక భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పని భారం తగ్గించాలని ,ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ,యాప్‌ుల విధానాన్ని రద్దు చేయాలన్నారు. సచివాలయం డ్యూటీలు రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో నాగార్జునమ్మ ,కాంతమ్మ, రాధమ్మ, ఈశ్వరి భాయ్, శాంత కుమారి, సుబేదా, శాంత కుమారి, లలిత పాల్గొన్నారు.

16న గ్రామీణ భారత్ బంద్

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ఫిబ్రవరి 16న దేశవ్యాప్త గ్రామీణ బందు , పట్టణ ప్రాంతాల్లో, పారిశ్రామిక కేంద్రాల్లో భారీ కార్మిక సమీకరణలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా , కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున భారత్ బందుకు పిలుపు ఇచ్చాయన్నారు. దీనిని జయప్రదం చేయడం కోసం ఇప్పటినుండి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంపద మొత్తాన్ని కొంతమంది పెట్టుబడిదారులు అందులో ప్రధానంగా ఆదాని ,అంబానీ లకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. రైతులను కారుతో ఎక్కించి చంపిన ఘటనలో సంబంధమున్న కేంద్రమంత్రి అజయ్ మిశ్రా పైచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కార్మికులు , రైతులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కోసం దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు

జరుగు ఈ కార్యక్రమంలో కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకులు బి.రామాంజనేయులు, ఎం.గోపాల్, సిహెచ్ సాయిబాబా, పి. నిర్మల, విజయ్, నాగేశ్వరరావు, పి. ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్ షర్మిల రాక

ఉమ్మడి కర్నూలు జిల్లా విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్: పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల సోమవారం కర్నూలు జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నేతలు కార్యకర్తలతో విస్తతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నారు. కర్నూలు వెంకటరమణ కాలనీలో ఉన్న తనిష్క్ ఫంక్షన్ హాల్ లో ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వైయస్ షర్మిల తో పాటు ముఖ్య నేతలు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, కొప్పులరాజు, జెడి శీలం, ఇతర నాయకులు హాజరుకానున్నారు. కర్నూలులో వైఎస్. షర్మిల పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా ఆమెకు స్వాగతం పలికేందుకు ర్యాలీని ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం ఉమ్మడి కర్నూలు జిల్లా విస్తతస్థాయి సమావేశం ముగించుకొని సాయంత్రం కడప జిల్లాకు బయలుదేరి వెళ్తారు.

రసస్యందిని, మనలోమాట పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

'మనలో మాట' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు పత్తిఓబులయ్య, జి.పుస్తయ్య , కల్యూర

అధ్యాపకులు, రచయిత్రి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి రచించిన సాహిత్య వ్యాససంపుటి 'రస స్యందిని', రేడియోప్రసంగాలు 'మనలో మాట' పుస్తకాలను రవీంధ్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, నంది అవార్డు గ్రహీత పత్తిఓబులయ్య, సాహిత్య సదస్సు అధ్యక్షులు చంద్రశేఖర కల్యూర, సాహిత్య సదస్సు కార్యదర్శి జెఎస్‌ఆర్‌కె.శర్మ, దంతవైద్యులు కరమేటి కిషోర్, ఉమాసుందరి, బ్రాహ్మణ కరివేణసత్రం హెచ్‌కె.మనోహర్, విశ్రాంత వృక్షశాస్త్ర ఉపన్యాసకులు జి.రంగనాథ్ తదితరులు ఆవిష్కరించారు. సాహిత్య సదస్సు, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం, తెలుగుభాష వికాస ఉద్యమం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో కురాడి చంద్రశేఖర్ కల్యూర అధ్యక్షోపన్యాసం చేశారు. సమాజ అభ్యుదయానికి తోడ్పడే ఆవశ్యకత నిరంతరం ఉంటుందని 'రసస్యందిని' పుస్తకంలోని రచనలు నీతి పథాన్ని బోధిస్తాయన్నారు. సమసమాజ స్థాపనకు తోడ్పడేవిగా 'మనలోమాట' రేడియో ప్రసంగాలు ఉన్నాయన్నారు. 'రసస్యందని' పుస్తకాన్ని సమీక్షించిన డాక్టర్ కవిరాజహంస తొగట సురేష్‌బాబు మాట్లాడుతూ 26 వ్యాసాల సంపుటిలో చక్కటి సాహిత్యం ఉందన్నారు. కర్నూలు జిల్లా సామాజిక జీవితం, భాషా వైశిష్టం, జానపద కళారూపాలు, మహనీయుల చరిత్రలు, రచనలు వంటి విభిన్న అంశాలపైన, విస్పష్టమైన విశ్లేషణలు ఉన్నాయన్నారు. 'మనలోమాట' రేడియో ప్రసంగాల పుస్తకాన్ని గిడుగు రాష్ట్రపురస్కార గ్రహీత, రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ మాట్లాడుతూ తెలుగు సామేతలను ఆధారంగా చేసుకుని వ్యక్తిత్వ వికాసాన్ని వివరించారన్నారు. తరిగిపోతున్న విలువలను పెంపొందించ డానికి ప్రాచీన సాహిత్యాన్ని ఆధారం చేసుకుని చేసిన ప్రసంగాలు మనిషిలోని లోపాలను తెలుసుకోవడానికి, చక్కటి సమాజ నిర్మాణానికి మార్గనిర్దేశం చేస్తాయన్నారు. రసస్యందిని కృతి స్వీకర్త అంతర్జాతీయ వ్యవసాయ వాస్తవేత్త కాదరబాద్ రవీంద్రనాథ్, మనలో మాట కృతి స్వీకర్త నరసం అధ్యక్షులు కావెం.సుబ్బలక్ష్మమ్మను డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి , లక్ష్మయ్య దంపతులు, అథితులు సన్మాన పత్రంతో సత్కరించారు.

కార్యక్రమాన్ని సమన్వయం చేసిన హెచ్.సీతామహాలక్ష్మి, హెచ్.హైమావతి, భవాని లీలావతి, పసుపులేటి నీలిమ, పద్మలత, సువర్ణజోసిలను జ్ఞాపికలతో అభినందించారు. కర్ణాటి చంద్రమౌలిని, ఎలమర్తి సూర్యశ్రీ,రమణయ్య, సాహితీ సదస్సు అధ్యక్షులు గౌరెడ్డి హరిచంద్రారెడ్డి, చరిత్రకారుడు అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరనున్న జిలానిబాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలులో ప్రముఖ గాయత్రి హాస్పిటల్ ఎండి షేక్ జిలానిబాషా ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నారు. సోమవారం ఎపి పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు ఆయన వైద్య రంగంలో అనేక సేవాలకార్యక్రమాలు చేశారు. 500 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. సమాజ సేలలో కూడా ముందున్నారు. మురికి వాడలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆస్పత్రి వార్షికోతం సందర్భంగా పేదలకు ఉచిత వైద్యం, మందులు పంపిణీ చేశారు. అనేక సందర్భాలలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆయన క్రియాశీల రాజకీయాల్లోకి రానున్నారు. కులమతాలకు అతీతంగా చర్చిలకు, మసీదులకు, దేవాలయాలకు దానధర్మాలు చేశారు.

2కె రన్‌లో టిజి.భరత్, సిఐ శ్రీధర్, గుండె వైద్యులు లక్ష్మణస్వామి, తదితరులు

వ్యాయామం లేక పెరుగుతున్న జబ్బులు

-కర్నూలు టిడిపి ఇంచార్జి టి జి భరత్ -ఉల్లాసంగా సాగిన 2కె రన్ మారథాన్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

శారీరక వ్యాయామం లేనందువల్ల రోజురోజుకూ ప్రజలు రోగాల బారిన పడుతున్నారని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి భరత్ అన్నారు. కర్నూలు నగరంలో టిజివి అనంత సిటీ స్క్వేర్ మాల్, స్పార్టన్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కె రన్‌లో ఆయన పాల్గొన్నారు. సిటీ స్క్వేర్ మాల్ నుండి అవుట్ డోర్ స్టేడియం చేరుకొని అటు నుండి మళ్లీ సిటీ స్క్వేర్ మాల్ వరకు ఈ 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ బయటకు ఎంత ఫిట్‌గా కనిపించినా శరీరంలో ఏమైనా అనారోగ్య సమస్యలు ఉండే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా కరోనా విజృంభించిన తర్వాత గుండె జబ్బులు పెరిగిపోయాయని చెప్పారు. యువకులు సైతం ఉన్నట్టుండి హార్ట్‌ఎటాక్‌తో చనిపోతున్న నేపథ్యంలో తమ గౌరీగోపాల్ హాస్పిటల్‌లో కర్నూలు ప్రజలకు ఉచిత గుండె వైద్య పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. ఏడాదికి ఒకసారైనా ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇక ప్రజాస్వామ్య దేశంలో ఈ ఎన్నికల సంవత్సరం ఎంతో ముఖ్యమన్నారు. సరైన నాయకుడు, సరైన ప్రభుత్వాన్ని గెలిపించుకుంటే ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందించారు. లక్కి డిప్ ద్వారా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీధర్, ప్రముఖ గుండె వైద్యులు లక్ష్మణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేస్తే నష్టపోతాం

- గోడుపట్టించుకోవడం లేదని బైపాస్ బాధితులు

ప్రజాశక్తి - ఆదోని

కొత్తగా మార్పు చేసిన బైపాస్ రోడ్డు నిర్మాణంలో సర్వస్వం కోల్పోతున్న ఆదోని బైపాస్ బాధితులు ఆత్మహత్యలకైనా సిద్ధం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ధనం వృధా అవుతున్న పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, నేషనల్ హైవే అధికారులు, సంబంధిత అధికారులు దాదాపుగా 260 ఎకరాలు ఔటర్‌రింగ్ రోడ్ కోసం భూమి అప్పట్లోనే కేటాయించారు. 1986లోనే ఇది కాదు అని 10 సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం అక్షరాల రూ.12 కోట్లతో ఆదోనిలో నేషనల్ హైవే కొరకు కేటాయించింది. భూమి కూడా స్వాధీనపరు చుకున్నారు. ఇది కాదు అని.. 260 ఎకరాలు ఆదోని ఔటర్ రింగ్ రోడ్ కొరకు భూమి ఉన్నదని, ఇన్ని సదుపాయాలు ఉండగా లేఅవుట్ల ప్లాట్ల మధ్యలో కొత్త రోడ్డును తీసుకువస్తున్నారు. ఈ రోడ్డు వేస్తే అక్షరాల రూ.250 కోట్ల నుంచి రూ.300 కోట్లు ప్రజాధనం వృధా అవుతుందని బాధితులు వాపోతున్నారు. రోడ్డు నిర్మిస్తే తాము తీవ్రంగా నష్టపోతామని లేఅవుట్ ప్లాట్ల బాధితులు వాపోతున్నారు. దాదాపుగా 650 పేద, మధ్య తరగతి కుటుంబాలు రోడ్డున పడుతాయని తెలిసినా కూడా కర్నూలు జిల్లా కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్ పట్టించుకోకపోవడం విచారకరమని బాధితులు వాపోతున్నారు. సమస్య పరిష్కరించకుండానే ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఈనెల 26న వైయస్సార్ నగర్ సమీపంలో నిర్మాణానికి భూమి పూజ చేయడం తగదని అభ్యంతరం తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పునర్ ఆలోచన చేయాలని కోరుతున్నారు.

ఈనెల 26న రోడ్డు నిర్మాణం కోసం భూమి పూజ చేసిన ఎమ్మెల్యే దృశ్యం

ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి

- మినీ జాబ్ మేళాలో ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి
- అవకాశాలను యువత సద్వినియోగం చేసుకొని : సబ్ కలెక్టర్
- గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా ఉద్యోగాలు : ఎమ్మెల్సీ మధుసూదన్
- భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో : పవన్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్రంలోని యువతి యువకులకు ఉద్యోగాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆదోని బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న విమల రీజెన్సీ 5 స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్, విమల రీజెన్సీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ అథారిటీ, స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి సహకారంతో యువతీ, యువకుల కొరకు మినీ జాబ్ మేళాను నిర్వహించారు. ముందుగా సబ్ కలెక్టర్, ఆదోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదోని శాసనసభ్యులు వై.సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ ద్వారా యువతీ యువకులకు ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి దోహదపడే దిశగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ అవకాశాలను సద్విని యోగం చేసుకోని భవిష్యత్తులో రాణించాలని ఎమ్మెల్యే యువతకు సూచించారు. సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ ద్వారా అంది స్తున్న అవకాశాలను యువత సద్వినియోగం చేసుకొని తమ నైపు ణ్యాన్ని మరింత మెరుగు పరు చుకోవాలని భవిష్య త్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. గత సంవత్సరంలో ప్రభుత్వం విశాఖలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వార రూ.13 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులలో భాగంగా విమల 5 స్టార్ హోటల్ కన్వెన్షన్ సెంటర్ ఆదోనిలో ఏర్పాటు విశేషమని పేర్కొన్నారు. ఇందుకుగాను 250 మంది యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు లభించాయని అన్నారు. అంతే కాక అభివృద్ధిలో భాగంగా ఆదోనికి బైపాస్ రోడ్డు, మెడికల్ కాలేజ్ రావడం ఆదోని అభివృద్ధికి దోహదపడు తుం దని అన్నారు. ఈ సందర్భంగా విమల రీజెన్సీ 5 స్టార్ హోటల్ యజమాని పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... మాతృభూమికై సేవ చేయాలన్న తపనలో భాగంగా 100 కోట్లు పెట్టుబడులతో ఫైవ్ స్టార్ హోటల్ కన్వెన్షన్ సెంటర్‌తో పాటు ఫుడ్ కోర్ట్, రెస్టారెంట్లు, హెల్త్ క్లబ్, వెల్నెస్ సెంటర్, ఫ్యాషన్ స్టోర్స్, సూపర్ మార్కెట్‌తో ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో అంతర్జా తీయ స్థాయిలో వ్యవసాయ రంగ ఉత్పత్తులను ఎగుమతులు దిగుమతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవల ప్మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్ కుమార్, పర్యాటకశాఖ డైరెక్టర్ గోపాల్, ఆంధ్రప్రదేశ్ ప్రవాస తెలుగు సొసైటీ సీఈవో హేమలత రాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

మాట్లాడుతున్న ఆలూరు సమన్వయకర్త విరుపాక్షి

కలిసికట్టుగా ముందుకు పోదాం

- వైసిపి ఆలూరు సమన్వయకర్త విరుపాక్షి

ప్రజాశక్తి - ఆస్పరి

అందరూ కలిసి కట్టుగా గెలుపే లక్ష్యంగా ముందుకు పోదాం అన్ని వైసిపి ఆలూరు సమన్వయకర్త విరుపాక్షి ఎంపీపీ,జడ్పీటిసిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని బనవనురు, పల్లుకుర బండ, ములుగుందం,కారుమంచి గ్రామాలలో వీరుపాక్షి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అయాంలో అవ్యవ,తాతలు పెన్షన్ తీసుకోవాలంటే గంటలకొద్దీ క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఉండేదని,వైసీపీ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవ్వతాతలకు ఇంటి దగ్గరికే వాలంటరీల ద్వారా పెన్షన్ అందించడం జరిగిందన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ప్రజల వద్దకే పరిపాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని కొనియాడారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను మాట తప్పకుండా ప్రతి ఒక్కటి అందించిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికలలో అందరూ కలిసికట్టుగా సైనికుల పనిచేసి ఆలూరు తాలూకా నుండి వైసిపి ఎమ్మెల్యేగా వీరుపాక్షిని గెలిపించుకొని జగన్మోహన్ రెడ్డికి కానుక ఇవ్వాలని నాయకులకు, కార్యకర్తలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోవర్ధన్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రాఘవేంద్ర, జడ్పిటిసి దొరబాబు,చిప్పగిరి మండల కన్వీనర్ మారయ్య, సర్పంచ్లు పెద్ద రెడ్డి,హరికృష్ణ, వెంకటేష్,సీఈఓ అశోక్,వైసీపీ మండల కన్వీనర్ పెద్దయ్య, మాజీ కన్వీనర్ రామాంజినేయులు,సొసైటీ మాజీ చైర్మన్ కేశవరెడ్డి, సచివా లయ మండల కన్వీనర్ బసవరాజు,కో కన్వీనర్ పురుషోత్తం రెడ్డి,నాయకులు చిన్నయ ప్ప, నాగప్ప,దత్తారెడ్డి, లక్ష్మీనారాయణ,మహానంది,ప్రకాష్,ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆదోని టికెట్ ఎవరికో..

- ఉత్కంఠకు తెర తీయలేని పార్టీలు - అయోమయంలో నాయకులు

ప్రజాశక్తి-ఆదోని

రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం మొదలైంది. ఈసారి టిక్కెట్టు తమకే అంటూ ఆదోనిలో పోటీ కూడా పెరిగింది. వేసవి కాలం మొదలు కాకమునుపే రాజకీయాలు కాక పుట్టిస్తున్నాయి. ఒకటని కాదు అన్ని పార్టీల్లో అభ్యర్థుల వడపోత మొదలైంది. వడపోతలో వైసీపీ ముందుంది. ఇప్పటికే మొదటి జాబితా.. రెండో జాబితాలు అంటూ ఇలా ఐదు వదిలింది. అయినా ఏ జాబితాలోనూ ఆదోని అభ్యర్థి ఎవరో ఇంతవరకు ఆ పార్టీ తేల్చలేదు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి తనకే టిక్కెట్టు ఖాయమనుకుంటూ గడప గడపలో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలోనే బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేయడం కూడా రాజకీయ ప్రయోజనమేనని పలువురు చెబుతున్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణం చేయడం వల్ల నష్టపోతున్నామని కొందరు బాధితులు కోర్టును ఆశ్రయించారు. ఎలాంటి న్యాయం జరగకుండానే ఎమ్మెల్యే భూమి పూజ చేయడం సమంజసం కాదంటూ అభ్యంతరం చెబుతున్నారు. భూకబ్జాలు అక్రమాలు చేశారంటూ ఆయనపై పలు ఆరోపణలు ఉన్నాయి. సాయి ప్రసాద్ రెడ్డి ని కాదని వైసిపిలో ఇతరులకు టికెట్ ఇచ్చే ప్రసక్తే లేదని ఆ పార్టీ కేడర్ చెబుతుంది. ఐనా ఎక్కడో అనుమానం పీకుతోంది పార్టీ శ్రేణులకు.. తాడేపల్లి నుంచి సాయికి పిలుపొచ్చిందని జనాల ఊహలు గుసగుసలాడుతున్నాయి. ఈ తడవ సాయిప్రసాద్ రెడ్డి ఆదోని కుర్చీ మడతపెట్టినట్టేనని మైనార్టీలకు బిసిలకు ఇచ్చే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. ఒక్క వైసిపిలోనే కాదు అటు టిడిపిలోనూ.. ఇటు జనసేనలోనూ ఇంతే! టిడిపిలో మీనాక్షినాయుడు, గుడిసె అది క్రిష్ణమ్మ, సూరం భాస్కర రెడ్డి, ఉమ్మి సలీం, మాన్వి దేవేంద్రప్ప, సౌదీ రాహుఫ్, కొత్తగా పార్టీలో చేరిన శ్రీకాంత్ రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు.

ఇలా వీరిలో ఎవరికి చంద్రబాబు కుర్చీ మడత పెడతాడో? ఎవరికి కుర్చీ వేస్తాడో తెలియని పరిస్థితి. రాజకీయ పొత్తులో భాగంగా జనసేన మల్లప్పకు సీటు వస్తుందని చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడి సంతకంతో కూడిన 175 మంది టిడిపి జాబితా సోషల్ మీడియాలో విడుదల కావడం.. పొత్తులో ఆదోని నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించడం.. చూసిన టిడిపి శ్రేణులు తట్టుకోలేకపోవడం! చివరకు అది అనఫిషీయలని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. అసలు చంద్రబాబు ఏదో ఒకటి తేల్చకుండా ఎందుకు నాన్చుతున్నారో తెలియక టిడిపి శ్రేణులంతా అసహనానికి గురవుతున్నారు. మీనాక్షినాయుడు మాజీగానే మిగిలిపోతారో? అధికారంలోకి వస్తారో.. రారో? వీటన్నింటికంటే ముందు టిక్కెట్టు వస్తుందో రాదో తెలియక ఆయన వర్గీయులు కన్ఫ్యూజన్లో ఉన్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయి నుండి కార్యకర్తలు నాయకులు మీనాక్షి నాయుడు వెంట ఉన్నారని టికెట్టు ఖాయమని ఆయన వర్గీయులు చెబుతున్నారు. సామాజిక సమీకరణల లెక్కలలో గ్యారెంటీగా తనకే కేటాయిస్తారన్న ష్యూరిటీతో రా..కదలిరా అంటూ గుడిసె అది క్రిష్ణమ్మ వేరువేరుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదే తరహాలో పార్టీ ఆవిర్భావం నుండి తమ కుటుంబం టిడిపి వెంట ఉందని సూరం భాస్కర రెడ్డి చెబుతున్నారు. తన ఆర్థిక పరిస్థితి గురించి అధిష్టానానికి వివరించామని తనకు గ్యారెంటీగా టికెట్ వస్తుందని ఆషాభావంతో ఉన్నారు. ఇక తెదేపాలో మైనార్టీ నాయకుడు ఉమ్మి సలీం, అయితే నేరుగా ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మీద విరుచుకుపడుతున్నారు. ప్రెస్‌మీట్లు పెట్టడం ఎమ్మెల్యే సాయి మీద గుంటూరు కారం చల్లినంత ఘాటుగా విమర్శిస్తున్నారు. సాయి మీద మాటలతో అటాక్ చేసిన వారు లేడన్నది జనంలో మాట. ఇదిలా ఉండగా టిడిపి జనసేన మధ్య పొత్తు ఉంటుందని పవన్ కళ్యాణ్ అంటున్నా స్థానికంగా ఇరు పార్టీల కార్యకర్తలకు రోజురోజుకు పొత్తుపై నమ్మకం సన్నగిల్లుతుందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రా కదలిరా కార్యక్రమంలో భాగంగా పత్తికొండకు జనసేన టిడిపి శ్రేణులు ఎవరికి వారే వేరువేరుగా తరలి వెళ్లారు. ఈ నేపథ్యంలోనే పవన్ కళ్యాణ్ రెండు మూడ్రోజుల్లో ఆదోనిలో ఒంటరిగా పర్యటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆదోని జనసేన నేత మల్లప్పలో ఆశలు చిగురించాయి. ఒకవేళ పొత్తు వికటిస్తే ఒంటరిగా పోటీ చేయాలని మల్లప్ప ఉవ్విళ్లూరుతున్నారు. మల్లప్పకు ఆర్థికంగా సినీ నిర్మాత టిజి.భరత్ అండదండలు కూడా ఉండటంతో గెలిచి చూపించాలన్న కసితో ఉన్నారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. కాంగ్రెస్ పగ్గాలు షర్మిల చేపట్టడంతో కొంత మైలేజ్ వచ్చిందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ముస్లిం మైనార్టీలు క్రిస్టియన్ ఓట్లు ఆకర్షించేందుకు కాంగ్రెస్ పార్టీ కూడా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ముస్లిం మైనార్టీ నాయకుడైన వ్యాపారవేత్త జాఫర్ రహీం కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నట్లు ప్రచారం నడుస్తుంది. ఇక బిజెపి మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, వ్యాపారవేత్త విట్టా రమేష్, వంశీ చైతన్య నర్సింగ్ హోమ్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ యాదవ్ టికెట్ ఆశిస్తూ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆదోనికి కుడి, ఎడమలుగా ఉన్న ఆలూరు మంత్రి గుమ్మనూరు జయరాంకు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డిలకు జగన్ కుర్చీ మడత పెట్టేశాడని పలువురు చెప్తున్నారు. ఆదోనిలో రాజకీయ వ్యవహారం ముదిరి పాకాన పడకుండా త్వరగా టికెట్లు బాగోతం తేల్చా ల్సిన అవసరం ఉంది.

జాతీయ స్థాయి పోటీలకు నందవరం విద్యార్థి ఎన్నిక

ప్రజాశక్తి - నందవరం

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు నందవరం గ్రామానికి చెందిన విద్యార్థి భాగ్య ఎమిల్డ ఎన్నిక కావడం పట్ల నందవరం గ్రామస్థులు హర్ష వ్యక్తం చేశారు. గత నెల డిసెంబర్ 30, 31 ఒంగోలులో జరిగిన 42వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచడం కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 30, 31, ఫిబ్రవరి 1 బాపట్ల జిల్లా చీరాల జరిగే 42వ జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున విద్యార్థిని ప్రాతినిధ్యం వహిస్తుంది. విద్యార్థిని భాగ్య అన్ని పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ప్రజలు ఆకాంక్షిం చారు. ప్రస్తుతం విద్యార్థి సి. బెలగల్ మండలంలోని కేజీబీ వీలో 9వ చదువుతుంది. విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపిక అవడం పట్ల తండ్రి శామ్యూల్ జాషువా వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడికి గాయాలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలోని తేజ నర్సింగ్ హోమ్ డాక్టర్ ఆది నాగేష్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. పత్తికొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళుతున్న ఆది నాగేష్ విరుపాపురంవద్ద బైకు అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాల పాలైన ఆయనను ఆదోని ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు వైద్యులు తెలిపారు.

బాధ్యతలు తీసుకున్న రమేష్ యాదవ్

బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడుగా రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని

భారతీయ జనతా పార్టీ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడుగా రమేష్ యాదవ్‌ను నియమించినట్లు బిజెపి జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ ఆదివారం ఆదోనిలో విలేకరులకు తెలిపారు. రమేష్ యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తలను, నాయకులను కలుపుకొని ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అధిష్టానం ఆదేశానుసారం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేసేలా పనిచేస్తానని పేర్కొన్నారు.

డేగల పాడులో వికసిత్ భారత్

ప్రజాశక్తి -చిప్పగిరి

వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం ఆదివారం మండల పరిధిలోని డేగలపాడు గ్రామంలో సర్పంచ్ నీలకంఠ అధ్యక్షతన పరిపాలన అధికారి శ్రీనివాసులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ కార్యక్రమం కింద ప్రభుత్వ డాక్టర్ పర్వతమ్మ సిహెచ్ఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యం లో ఉచిత వైద్యం శిబిరం ద్వారా ప్రజలకు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహి ంచి మెడిసిన్స్‌ను అందజేశారు. ఉచిత వైద్య శిబిరం ద్వారా నిరుపేద ప్రజలకు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించడం మంచి శుభ పరిణామని సర్పంచ్ నీలకంఠ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సంకల్పయాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. మహిళ పోలీసు శాంతి, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డేగల పాడు గ్రామంలో జరిగిన సంకల్ప యాత్రలో పాల్గొన్న అధికారులు

శ్రీ మాల మల్లేశ్వర సన్నిధిలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి -హోళగుంద

మండల పరిధిలో వెలిసిన శ్రీ మాల మల్లేశ్వర దేవరగట్టులో ఆదివారం సందర్భంగా భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం 5 గంటల నుండే భక్తులు ప్రత్యేక పూజల కోసం గిరి పైకి క్యూ కట్టారు. అర్చకులు గిరి స్వామి మనోహర్ స్వామీల ఆధ్వర్యంలో స్వామివారి దర్శనం కల్పించారు. భక్తులకు దేవరగట్టు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హొళగుంద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూజలు చేస్తున్న అర్చకులు

పెండింగ్ బకాయిలు చెల్లించాలి : ఎస్‌టీయు

మాట్లాడుతున్న ఎస్‌టీవి నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని పట్టణంలో ఆదివారం డివిజన్ స్థాయి సమావేశము స్థానిక ఎస్టీయు భవనంలో ఎస్టీయు సీనియర్ నాయకులు టి.కాశీ విశ్వనాథ శాస్త్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశమునకు ముఖ్య అతిథిగా ఎస్టీయు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పి.నాగేంద్రప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న రెండు లక్షల మంది ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ కుటుంబ వైద్య అత్యవసరాల కోసం తమ నెలసరి జీతాల నుండి పొదుపు చేసుకున్న పీఎఫ్, ఏపీజిఎల్‌ఐసి,పొదుపు సొమ్ముల నుండి రుణాలకు దరఖాస్తు చేసుకున్న నెలలు తరబడి చెల్లించకపోవడాన్ని బాధాకరమని పేర్కొన్నారు. పిఆర్సి నుండి 2023 జూలై వరకు అన్ని బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయని తెలియ జేశారు. 2023 జూలై 13న ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో 2023 సెప్టెంబర్ నాటి బకాయిలన్నీ చెల్లించేస్తామని ఇచ్చిన హామీ వట్టి బుకాయింపేనని తేలిపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్డ్ అయితే పదవీ విరమణ తుది ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో చెల్లించడము అనుమానమేనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్టియు సీనియర్ నాయకులు నాగప్రసాద్, శ్రీనివాసులు, జ్యోతిమూర్తి, హనుమన్న, శ్రీనివాసులు నారాయణ పాల్గొన్నారు.

'రా కదలిరా'కు తరలిన తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి - ఆదోని

పత్తికొండలో జరిగే రా కదలిరా సభకు భారీగా తరలి వెళ్లినట్లు ఆదోని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. ఆదివారం 25 వాహనాలు, ఒక బస్సు, 20 స్కూటర్స్ ద్వారా ఆదోని నుంచి తరలి వెళ్లిన తెలుగు తమ్ముళ్లు. అధినేత చంద్రబాబు నాయుడు రాక కార్యకర్తలు, నాయకుల్లో ఉత్తేజం నింపిందని గుడిసె ఆది కృష్ణమ్మ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత తల్లిని చెల్లిని గెంటేసిన సిఎం జగన్ రాష్ట్ర మహిళలు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షుడు గుడిసె శ్రీరాములు, మాజీ ఎంపీపీ మురళీ, జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు రామకృష్ణ, గిరిధర్, ఆల్ఫాఫ్ హుస్సేన్, సంతేకొల్లూరు రాఘవరెడ్డి,, విజయ్, మండగిరి బాబురావు నాగేంద్ర, లక్ష్మీకాంతరెడ్డి, టౌన్ ముస్లిం మైనారిటీ నాయకులు, అల్తాఫ్ హుస్సేన్, సిరాజ్, జిలాన్, సద్దాం, మహిళా నాయకురాళ్ళు పద్మ, కొండమ్మ, మారెమ్మ,, పార్వతి లక్ష్మీ తిక్క లక్ష్మి, ఎల్లమ్మ, హనుమక్క, మండగిరి పరమేష్, జమ్మన్న జంగాల రామయ్య గోపాల్ తదితరుల టిడిపి నాయకులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

కార్యకర్తలతో గుడిసె ఆదికృష్ణమ్మ

రైల్వే గేటు పునఃప్రారంభించాలి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మార్కెట్ యార్డు వద్ద ఉన్న రైల్వే గేటును పునఃప్రారంభిం చాలని స్థానికులు కోరుతున్నారు. రైల్వే గేటును మూసి వేయటం వల్ల మార్కెట్ యార్డు, శిరుగుప్ప రోడ్ వైపు నుంచి పట్టణంలోకి ప్రయాణించే వారు ప్రతిరోజూ కిలోమీటర్ల కొద్ది వృధా ప్రయాణం చేయాల్సి వస్తోందన్నారు. బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుకోవడం వల్ల ప్రమాదాలు జరిగి మృత్యువాత పడిన సందర్భాలూ ఉన్నాయన్నారు. కనీసం చిన్న తరహా వాహనాలు, పాదచారుల కోసమైనా రైల్వే గేటును తెరవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జగనన్న కాలనీకి అండర్ గ్రౌండ్ ఏర్పాటు చేయాలి

పట్టణము నుండి ఈఎస్ఐ ఆసుపత్రి మీదుగా జగనన్న కాలనీకి వెళ్లే రహదారిలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని స్థానిక కోరుతున్నారు. ఆ రోడ్డు గుండా రాకపోకలు కూడా సాగే వాహనాల సంఖ్య పెరిగిందని, ప్రస్తుతం అక్కడ ఏర్పాటుచేసిన రైల్వే గేటు ఎప్పుడూ రద్దీగా ఉంటోంది. రైళ్ల రాకపోకలు పెరగడం వల్ల ఎప్పుడు గేటు వేస్తూనే ఉంటున్నారని వాహనదారులు చెబుతున్నారు. దీనివల్ల గేటు తెరిచే వరకు నిలిచాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రజల రాకపోకల సౌకర్యార్థం అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేసి వేచి చూసే సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

గేటుకు అడ్డంగా కట్టిన గోడ

లేనియెడల ప్రజలను సమీకరించి ఆందోళనలకు సిద్ధమవుతామన్నారు.

జగన్ గుండెల్లో రైళ్లు : టిడిపి

ప్రజాశక్తి-ఆలూరు

చంద్రబాబు నాయుడు చేపట్టిన 'రా కదలి రా' సభను చూసి జగన్ గుండెల్లో రైళ్లు పరిగెత్తల్సిందేనని ఆలూరు టిడిపి మాజీ ఇంచార్జ్ వైకుంఠం శివప్రసాద్, జ్యోతి తెలిపారు. ఆదివారం పత్తికొండ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన రా కదలి రా సభకు హాజరై వారు మాట్లాడారు. సైకిల్ రావడం పక్క అని తెలిపారు. అంతకుముందు ఆలూరులో టిడిపి నాయకులు,కార్యకర్తలతో కలసి పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి అంబేద్కర్,వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాలర్పించి భారీ వాహనాలలో సభకు తలివెళ్లారు. మాజీ ఇంచార్జ్ లు వైకుంఠం మల్లికార్జున చౌదరి,వీరభద్రగౌడ్,నియోజకవర్గ పరిశీలకులు గంజె.నాగరాజు ఆధ్వర్యంలో విడివిడిగా నాయకులు,కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి పత్తికొండ సభకు భారీ ఎత్తున వాహనాలలో తరలి వెళ్లారు.

ప్రజాశక్తి
సోమవారం 29 జనవరి 2024
5
నంద్యాల



జిల్లా అభివృద్ధికి చర్యలు

- వైసిపి ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారు
- రా కదలి రా బహిరంగ సభలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు

మాట్లాడుతున్న టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - పత్తికొండ

తాము అధికారంలోకి రాగానే జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. వైసిపి ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారని విమర్శించారు. పత్తికొండ ఎమ్మెల్యే మాఫియాకు అధినేత్రి అని, అనకొండ మాదిరి మేస్తున్నారని ఆరోపించారు. జయరాంను ఆలూరు నుండి ప్యాక్ చేసి ఎంపీ అభ్యర్థిగా ప్రకటిస్తే ఎంపీ సీటు వద్దని పారిపోయాడని అన్నారు. ఆదోని ఎమ్మెల్యేవి ఎక్కడ చూసినా భూకబ్జాలేనని, మట్కా, క్రికెట్ బెట్టింగ్‌లో దిట్ట అని అన్నారు. మంత్రాలయం ఎమ్మెల్యే ఇసుకను మింగేస్తున్నారని, చెరువును ఆక్రమించుకున్నారని, కర్ణాటక మద్యం తెచ్చి వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే దేవాదాయ భూములు కొట్టేసారని, ఆయన్ని ఇంటికి పొమ్మన్నారని తెలిపారు. కోడుమూరులో పెత్తనం అంతా షాడో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిదన్నారు. కర్నూలు ఎమ్మెల్యే అవినీతిలో కింగ్ కాంగ్ అని అన్నారు. ఇలాంటి ఎమ్మెల్యేలు మనకు అవసరమా అని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. ఆదోనిలో మిర్చియార్డు, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లాలో విండ్, సోలార్ విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. హంద్రీనీవా ద్వారా అన్ని చెరువులకు నీళ్లు ఇస్తామన్నారు. కర్నూలు జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ పెడతామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు బీటి నాయుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి కేయి కృష్ణమూర్తి, మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, మాజీ మంత్రులు అఖిల ప్రియ, పల్లె రఘునాథ రెడ్డి, నాయకులు కెయి ప్రభాకర్, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి నియోజకవర్గ ఇంచార్జీలు కెయిశ్యామ్‌బాబు, పి.తిక్కారెడ్డి, కోట్లసుజాతమ్మ, మీనాక్షి నాయుడు, ప్రభాకర్, బివి.జయనాగేశ్వర్ రెడ్డి, జనసేన కర్నూలు జిల్లా కన్వీనర్ చింతా సురేష్, నియోజకవర్గ ఇంచార్జీలు రాజశేఖర్, రేఖ గౌడ్ పాల్గొన్నారు.

క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలంలో పోటెత్తిన భక్తజనం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. క్షేత్రం ప్రధాన వీధులన్నీ కిటకిట లాడాయి. చలి తీవ్రత ఉన్నప్పటికీ భక్తులు లెక్క చేయకుండా తెల్లవారుజామున మూడు గంటల నుండి పాతాళ గంగలో స్నానాలాచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు క్యూలైన్లో వేచి ఉన్నారు. స్పర్శదర్శనం, ఆర్జిత సేవలు, అభిషేకాలు నిలిపివేయడంతో భక్తులు శీఘ్ర, అతి శీఘ్ర, ఉచిత క్యూలైన్లలో వేచి ఉండి దర్శించు కున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు 3 నుండి 4 గంటల సమయం పడుతుందని భక్తులు తెలిపారు. క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులకు ఉచితంగా మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లు అందజేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పరిపాలన భవనంలో పని చేసే సిబ్బందికి ప్రత్యేక డ్యూటీలు కేటాయించారు. లడ్డు ప్రసాదాలు భక్తులకు అడిగినన్ని ఇచ్చేందుకు అధికంగా తయారు చేసి కౌంటర్లను ఏర్పాటు చేశారు. క్షేత్ర పరిధిలో సంఘటనలు జరగకుండా సిసి కెమెరాల ద్వారా కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షించారు. క్షేత్రంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెద్దిరాజు నిరంతరం క్షేత్ర పరిధిలో పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు తెల్లవారు జామున మూడు గంటలకి ఆలయ ద్వారాలు తెరిచి మహా మంగళహారతి అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతి ఇచ్చారు. భక్తులను అలరించేందుకు దేవస్థానం పలు రకాల సాంస్కృతి కార్యక్రమాలను ఆలయ దక్షిణ మాడవీధుల్లో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. లోక కళ్యాణం కోసం దేవస్థానం నిర్వహించే పూజలలో భాగంగా స్వామి అమ్మవార్లకు పల్లకి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి అమ్మ వార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పల్లకి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

నిత్యన్నదాన పథకానికి రూ. 25 లక్షలు విరాళం

శ్రీశైల దేవస్థానంలోని అన్నప్రసాద వితరణ పథకానికి సికింద్రాబాద్‌కు చెందిన రాణి కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ గల్లా గుండయ్య రూ. 25 లక్షలు విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఈ మొత్తాన్ని కార్యనిర్వహణ అధికారి డి.పెద్దిరాజుకు అందజేశారు. దాతకు శేష వస్త్రాలను, ప్రసాదాలను, సంబంధిత పత్రాలను అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ హెచ్‌జి.వెంకటేష్, ప్రజాసంబంధాల అధికారి టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యన్నదాన పథకానికి రూ. 25 లక్షలు విరాళం అందజేస్తున్న దాత గల్లా గుండయ్య

ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు

- శ్రీ గురురాఘవేంద్ర బ్యాంకు కోచింగ్, విద్యా సంస్థల అధినేత చైర్మన్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి
- పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత 40వ మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - సంజామల

గ్రామీణ ప్రాంత పేదల కోసమే పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించి కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నామని నంద్యాల శ్రీ గురురాఘవేంద్ర బ్యాంకు కోచింగ్, విద్యా సంస్థల అధినేత చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి తెలిపారు. ఆదివారం సంజామల మండలం మంగంపల్లె గ్రామంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో ఉచిత 40వ మెగావైద్య శిబిరం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో గుండె జబ్బులు, బిపి, షుగరు , మోకాళ్ళ నొప్పులు, కంటివ్యాదులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీలకు సంబందించిన వ్యాదులు, చెవి, ముక్కు, గొంతు సంబంధిత జబ్బులకు, దంతవ్యాదులు, చర్మవ్యాదులకు వైద్యసేవలు అందించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ నంద్యాల, కర్నూలు పట్టణానికి చెందిన అనుభవజ్ఞులైన డాక్టర్లతో వైద్య శిబిరంలో రోగులను ఉచితంగా వైద్య పరీక్షలు చేయిస్తున్నామని అన్నారు. వైద్య శిబిరానికి హాజరైన ప్రజలందరికీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత భోజనం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ శిబిరంలో 1350 మంది రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారని తెలిపారు. ప్రతి నెలా చివరి ఆదివారం పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలు ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవడం సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేకావలిరెడ్డి మాట్లాడుతూ మా అబ్బ జ్ఞాపకార్థం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ పేరున మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి తన సొంతం ఊరికి మేలు చేయాలన్న లక్ష్యంతో నంద్యాలలో స్థిరపడినా ఈ గ్రామ ప్రజలకు సేవ చేస్తున్నారని గుర్తు చేశారు.

ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆళ్లగడ్డలో అంగన్వాడీల విజయోత్సవ సభ

మాట్లాడుతున్న నాయకులు ఏసురత్నం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని సిడిపిఒ కార్యాలయం ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల విజయోత్సవ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, ఏపీ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మలమ్మ మాట్లాడారు. అంగన్‌వాడీలు అకుంఠిత దీక్షతో పోరాడి హక్కులు సాధించుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుండి డిమాండ్స్‌ను జీవో రూపంలో సాధించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బాల వెంకట్, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, నాయకురాలు శైలజ, పెద్దక్క, సుధామణి, నరసమ్మ, శాంతి, భారతి, సిఐటియు తాలుగా కార్యదర్శి రమేష్ బాబుతో పాటు ఆళ్లగడ్డ ప్రాజెక్ట్ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

జిల్లా నూతన కలెక్టర్‌గా కె.శ్రీనివాసులు

- ప్రస్తుత కలెక్టర్ మనజీర్ జిలానీ సామున్ శ్రీకాకుళంకు బదిలీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జిల్లా నూతన కలెక్టర్‌గా ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును నియమిస్తూ రాష్ట్ర పరిపాలన విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయా జిల్లాలో 3 సంవత్సరాలుగా విధుల్లో ఉన్న వారిని, స్థానికతను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన విభాగం రాష్ట్ర వ్యాప్తంగా 21 మంది జిల్లా కలెక్టర్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా నంద్యాల జిల్లా కలెక్టర్‌ను శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు మూడు రోజుల్లో నూతన కలెక్టర్ బాధ్యతలు చేపట్టనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు

గ్రామంలో తెలుపులపైకి పల్లకిని తీసుకెక్తున్న గ్రామస్తులు

నరసాపురంలో పారువేట ఉత్సవాలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని నరసాపురం గ్రామంలో అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పారవేట ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా తిమ్మనపల్లి గ్రామం నుంచి పారువేట ఉత్సవ పల్లకి గ్రామ సమీపంలోకి రాగానే గ్రామ పెద్దలు పల్లకికి ఎదురెళ్లి మంగళ వాయిద్యాలతో ఆనవాయితీ ప్రకారం గ్రామంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు తెలుపులపై కొలువైన లక్ష్మి నరసింహ స్వామికి గ్రామ పెద్దలు, భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు. పల్లకి రాక సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పారువేట ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సచివాలయం స్వీపర్ మృతి

- మాజీ జడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి నివాళి

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాల సచివాలయం-1లో స్వీపర్‌గా పని చేస్తున్న పెరుమాళ్ళ రాముడు అలియాస్ ఏసన్న (75) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, సర్పంచి పెరుమాళ్ల శేషన్నలు ఏసన్న మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కర్నూల్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి విషయం తెలుసుకొని పగిడ్యాల గ్రామానికి చేరుకొని నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఏసన్న మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ జడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి

రీసైక్లింగ్ ఆర్ట్‌లో ఫణీంద్ర కుమార్ ప్రతిభ

- ఫణీంద్ర కుమార్‌ను ఘనంగా సన్మానించిన బిసి రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

రీసైక్లింగ్ ఆర్ట్‌లో భాగంగా వ్యర్థాలతో వివిధ కళాకృతులు రూపొందిస్తున్న ఫణీంద్ర కుమార్ అభినందనీయుడని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బీసీ రాజారెడ్డి నివాసంలో మండలంలోని పసుపుల గ్రామానికి చెందిన అయితే ఫణీంద్ర కుమార్ ప్రతిభను అభినందిస్తూ బిసి రాజారెడ్డి ఘనంగా సన్మానించారు. మెమెంటో, నగదు పురస్కారం అందజేశారు. మండలంలోని పసుపల గ్రామానికి చెందిన ఐతా నాగరాజు, సుభాషిని దంపతుల కుమారుడు ఐతా ఫణీంద్ర కుమార్ డిగ్రీ వరకు చదువుకొని రీసైక్లింగ్ ఆర్ట్‌పై ఆసక్తితో ఖాళీ సిగరెట్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ బాటిల్స్, ఫ్యాబ్రిక్స్ తదితర వ్యర్థాలతో పలు రకాల ఆకృతులను తయారు చేసేవారు. అందులో భాగంగా ఖాళీ సిగరెట్ ప్యాకెట్‌లతో 7 అడుగుల 7 ఇంచులు ఉండే ఒంటె ఆకృతిని అద్భుతంగా తయారు చేసి 2021 డిసెంబర్‌లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డు వారి చేత అవార్డు, మెడల్, సర్టిఫికెట్‌ను పొందారు. 2022 జనవరిలో ఏషియా బుక్ ఆఫ్ వారు, ఫిబ్రవరి నెలలో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ వారు ఫణీంద్ర కుమార్ ప్రతిభను గుర్తించి అవార్డులు, మెడల్స్ ను అందజేశారు. 2023 డిసెంబర్ 29న పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లోని గురునానక్ ఆడిటోరియంలో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ అవార్డ్స్ షోలో ఫణీంద్ర కుమార్‌ను ప్రత్యేకంగా సన్మానించి అవార్డు, మెడల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ ఫణీంద్ర కుమార్ నిరుపేద ఆర్య వైశ్య కుటుంబంలో జన్మించినా, చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయినా దిగాలు పడకుండా ఎంతో మనోధర్యంతో డిగ్రీ వరకు చదువుకొని పర్యావరణానికి హానికరమైన వ్యర్థాలతో అందమైన కళాకృతులను తయారు చేస్తుండడం అభినందించదగ్గ విషయమన్నారు. బనగానపల్లె మండల వాసికి ఇన్ని అవార్డులు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఫణీంద్ర కుమార్ భవిష్యత్తులో మరిన్ని అద్భుత కళాకృతులు తయారుచేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం సుధాకర్ రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు రామ సుబ్బయ్య, బొబ్బల మహేశ్వర రెడ్డి, కోటా సుబ్బరాయుడు, ఏచూరి సుబ్రమణ్యం, తేలపురి సుబ్బారాయుడు, నుసి విష్ణువర్ధన్ రెడ్డి, చాంద్ భాషా పాల్గొన్నారు.

రీసైక్లింగ్ ఆర్ట్‌లో ప్రతిభ చాటిన ఫణీంద్ర కుమార్‌ను సన్మానిస్తున్న బీసీ రాజారెడ్డి

ఉచిత శాంతిరథం, ఫ్రీజర్ బాక్స్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి, వారి సోదరులు బిసి రాజారెడ్డి, బిసి రామనాథరెడ్డిలు

ఉచిత శాంతిరథం ప్రారంభం

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె నియోజకవర్గంలో చనిపోయిన వారి పార్థివదేహాన్ని స్మశాన వాటికకు తీసుకువెళ్ళటానికి రూ. 11 లక్షల విలువ చేసే శాంతి రథాన్ని, ఫ్రీజర్ బాక్స్‌ను మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి వారి సోదరులు పట్టణ మాజీ సర్పంచి రాజారెడ్డి, టిడిపి నియోజకవర్గ నాయకులు బిసి రామనాథరెడ్డిలు ఆదివారం ప్రారంభించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం ఆవరణలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి తల్లిదండ్రులు కీర్తిశేషులు బిసి.లక్ష్మమ్మ, బిసి.గుర్రెడ్డి, సోదరుడు బిసి.బాల తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం శాంతి రథం, ఫ్రీజర్ బాక్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో కులమతాల నిమిత్తం లేకుండా అన్ని వర్గాల వారు మరణించిన వారి అంతిమ యాత్ర, దహన సంస్కారాల కోసం ఈ శాంతి రథంను, ఫ్రీజర్ బాక్స్‌ను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. కావాల్సిన లక్ష్మిరెడ్డి 6305949418 ఫోన్ చేసి ఉచితంగా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

రోడ్ల మరమ్మత్తు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో ఆదివారం రూ.5 లక్షలతో రోడ్ల మరమ్మత పనులను మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యం.లక్ష్మిదేవి, వైసిపి నాయకులు కురువ శ్రీను, మద్దిలేటి, సురేష్, శేషు, రాజు, వేణు, వెంకటేష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి

జగనన్నకే జనం ఆశీస్సులు

- రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - చాగలమర్రి

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజల ఆశీస్సులు తిరిగి తప్పనిసరిగా ఉంటాయని రాష్ట్ర జల వనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ శాసనసభ్యులు బిజేంద్రారెడ్డిలు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం చాగలమర్రికి చెందిన జిల్లా జెసిఎస్ కోఆర్డినేటర్ షేక్ బాబూలాల్ కుమార్తె వివాహ వేడుకలకు వారు కుటుంబ సమేతంగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఈ ఐదు సంవత్సరాల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ దాదాపుగా అమలు చేశారన్నారు. గత ప్రభుత్వంలో టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చారో, ఎంతవరకు అమలు చేశారో ప్రజలకు తెలుసన్నారు. ఎంతమంది ఏకమైనా జనం ఆశీస్సులతో మరలా వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వీరభద్రుడు, వైసిపి మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు గంధం రాఘవరెడ్డి, రాష్ట్ర ఆర్థిక సంస్థ డైరెక్టర్ శ్రీ బాలవిద్య, ఉప సర్పంచి షేక్ సోహెల్, మాజీ ఉపసర్పంచ్ అబ్దుల్లా భాష, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, మండల కో ఆప్షన్ సభ్యులు జిగ్గి గారి ఇబ్రహీం, ఎంపీటీసీలు ఫయాజ్, లక్ష్మిరెడ్డి, సాగునీటి సంఘ అధ్యక్షుడు శేషు రమేష్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా జాబిర్, వైసిపి మండల ఉపాధ్యక్షులు ముల్లా ఖాదర్ బాషా, వెంకటరమణ, ప్రముఖ వ్యాపారవేత్తలు ముల్లా చక్రం షబ్బీర్, దాదా బీడీ ఖాజా, వైసిపి మండల యువజన సంఘ అధ్యక్షుడు పెయింటర్ షరీఫ్, వార్డు సభ్యులు ముల్లా బ్రాందీన్, ఆర్ఎస్ రమణ, షేక్ షబ్బీర్, రామకృష్ణ మెడికల్ స్టోర్ నాగేంద్ర, ఐడియా బాబు, బచ్చు సుబ్రహ్మణ్యం, మండల పార్టీ ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫీ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా జెసిఎస్ కోఆర్డినేటర్ షేక్ బాబూలాల్ కుమార్తె వివాహ వేడుకలకు మాజీ పార్లమెంట్ సభ్యులు గంగుల ప్రతాపరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



పెళ్లి కుమారున్ని ఆశీర్వదిస్తున్న రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే నాని

ఉత్తమ అవార్డు పొందిన ఎంపీడీవోను సన్మానిస్తున్న దృశ్యం

ఉత్తమ ఎంపిడిఒకు ఘన సన్మానం

ప్రజాశక్తి - బనగానపల్లె

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు పొందిన శివరామయ్యను ఆదివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో 6వ వార్డు మెంబర్ సూరి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు యునూస్, మాభాష నాగేష్, వలి, సుమంత్, జాఫర్, వెంకటేష్ గౌడ్‌లు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ సూరి మాట్లాడుతూ మూడవసారి ఉత్తమ ఎంపీడీవోగా శివరామయ్య అవార్డు అందుకోవడం హర్షనీయమన్నారు. ఎంపీడీవో శివరామయ్య నిబద్ధతతో, కార్యదక్షతతో పని చేయడం వల్లనే మూడవసారి అవార్డు అందుకున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అవార్డులు అందుకోవాలని, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందేలా సేవలు అందించి ఇంకా అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

నేడు 'జగనన్నకు చెబుదాం-స్పందన'

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమానికి నేడు ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నాటుసారా బట్టీలపై దాడి

ప్రజాశక్తి - ఆత్మకూర్ : ఆత్మకూరు డిఎస్పీ శ్రీనివాసరావు, ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిఐ ఏం.నాగభూషన్ ఆదేశాల మేరకు ఆదివారం ఆత్మకూరు ఎస్ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మండలంలోని సిద్దాపురం గ్రామ పొలిమేరల్లో నాటుసారా బట్టీలపై దాడులు చేశారు. 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 14 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- పాల్గొన్న మాజీ ఎంపి గంగుల, శాసనమండలి మాజీ విప్ గంగుల
- ఘనంగా పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి, శాసనమండలి మాజీ విప్, రాష్ట్ర జల వనరుల శాఖ సలహా మండలి సభ్యులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డిలు పేర్కొన్నారు. పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ఉన్నత పాఠశాలలో 1956 నుండి 2023 వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కనుల పండగలా జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి, శాసనమండలి మాజీ విప్, రాష్ట్ర జల వనరుల శాఖ సలహా మండలి సభ్యులు గంగుల ప్రభాకర్ రెడ్డితో పాటు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డితో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు ఎన్నో సంవత్సరాల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంతో నాటి జ్ఞాపకాలు, ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో తనకు అవకాశం కల్పించినందుకు ప్రధానోపాధ్యాయులు వీర రాఘవయ్యకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇంకా చాలామంది మిత్రులకు సమాచారం లేకపోవడంతో వారు రాలేకపోయారని, ఈ విషయం తనను నిరుత్సాహ పరిచిందన్నారు. భవిష్యత్తులో మళ్లీ మళ్లీ ఇలాంటి కార్యక్రమాలు జరగాలని, ప్రతి వార్షికోత్సవానికి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించేలా చూడాలని కోరారు. రెండు గదులతో ఉన్న పాఠశాల మంచిగా రూపుదిద్దుకుందన్నారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనేలా చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వైపిపిఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 12 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చిన ఎద్దుల పాపమ్మ, మద్దిలేటి రెడ్డి దంపతులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. మాస్టర్ ప్లాన్‌తో వైపిపిఎం పాఠశాల రూపురేఖలను సమిష్టిగా మార్చుకుందామన్నారు. మాజీ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాల రూపురేఖలను మార్చడం జరుగుతుందన్నారు. రూరల్ ప్రాంతాల్లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని తమ తండ్రి తిమ్మారెడ్డి ఆశయమని, తమ అన్న గంగుల ప్రతాపరెడ్డి ఎర్రగుంట్లలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. ఆళ్లగడ్డలో కూడా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల ఆస్తిని కాపాడతామని, అందుకే 50 లక్షల రూపాయలతో కళాశాల చుట్టూ ప్రహరీ గోడ ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదికలు పంపమన్నారు. త్వరలోనే అనుమతులు మంజూరు అవుతాయన్నారు. ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి మాట్లాడుతూ తాను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో చదివానని, వారు ప్రతి సంవత్సరం రీ యూనియన్ ప్రోగ్రాం కింద పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులతో సమావేశాలు నిర్వహిస్తారన్నారు. మా పెదనాన్న విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారని, వారు చెప్పినట్లుగానే ఈ నెల 30న కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు జిల్లా మాజీ న్యాయమూర్తి కాశీభట్ల శివప్రసాదరావు, డాక్టర్ రాంగోపాల్ రెడ్డి, విశ్వభారతి హాస్పిటల్స్ డైరెక్టర్ నాగిరెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్ శంకర్ రెడ్డి, ఏవిఎస్ రెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, ఎంఈఓ శోభా వివేకవతి, వైపిపిఎం పాఠశాల హెచ్ఎం వీర రాఘవయ్య, విశ్రాంత హెచ్ఎం వెంకటేశ్వర్లు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ గంగులను సన్మానిస్తున్న దృశ్యం

హాజరైన పూర్వ విద్యార్థులు

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - చాగలమర్రి

సస్యరక్షణ చర్యలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఫెసిలిటేటర్ యోగిరెడ్డి తెలిపారు. మండలంలోని వనిపెంట, శెట్టి వీడు గ్రామ పరిసరాల్లోని సజ్జ, మొక్కజొన్న సీడ్ పంటలపై అవగాహన కార్యక్రమాన్ని ఫెసిలిటేటర్ యోగి రెడ్డి పంటలపై సస్యరక్షణ, పురుగుమందు నివారణ, పంటల ఉత్పత్తుల గురించి పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడు పంటల యాజమాన్యం, కాల వ్యవధి, చీడపీడలు, తెగుళ్లు, వాతావరణ అనుకూలత తదితర అంశాలపై సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో విత్తన కంపెనీ బ్రీడర్ మేనేజర్ పవన్, రపంతుల్లా భాష, చాగలమర్రి డీలర్లు రవి, సల్లా నాగరాజు, ప్రసాద్ రెడ్డి, బ్రహ్మయ్య, చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నాగేంద్ర, బాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సజ్జ పంటలను పరిశీలిస్తున్న అగ్రికల్చర్ డిప్లొమా విద్యార్థులు

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిని, హాజరైన విద్యార్థిని విద్యార్థులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

విద్యార్థినీ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారిని లక్ష్మీదేవి అన్నారు. ఆదివారం పట్టణంలోని బీసీ వసతి గహంలో జిల్లాలోని పదవ తరగతి వసతి గృహ విద్యార్థిని, విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. నిపుణులైన అధ్యాపక బృందంచే విద్యార్థులకు చక్కటి మెలుకువలను అందించినట్లు చెప్పారు. ఆళ్లగడ్డ వసతి గృహం సంక్షేమ అధికారి సురేష్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు సమయం తక్కువగా ఉందని, ఉన్న సమయాన్ని ఉత్తమంగా ఉపయోగించుకొని మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. సందర్భంగా విద్యార్థులు ఈ కార్యక్రమం ఉపయోగకరంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారులు సువర్ణ, హరిత, ఎల్లమ్మ, గ్రేడ్-1 ఆఫీసర్ మురళి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో జాతీయ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు తమ అకాడమీ విద్యార్థులు ఎంపికయ్యారని మౌళి తైక్వాండో అకాడమీ కోచ్‌లు ఎల్‌టి గురుచంద్రశేఖర్, ఎల్‌టి భువనేశ్వరి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ నెల 20, 21వ తేదీలలో నంద్యాలలోని పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియంలో 37వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల తైక్వాండో పోటీలలో తమ అకాడమీ విద్యార్థులు డింపుల్, చైతన్య రామ్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. డింపుల్, చైతన్య రామ్‌లు బంగారు పథకం సాధించి పూంసే విభాగంలో ఎంపికయ్యారన్నారు. వీరు వచ్చే నెల 2 నుంచి 4వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్ జిల్లాలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. అలాగే జయరాజ్, అయినయ, గోపిక, స్వాతి సిల్వర్ మెడల్, గోపీచంద్రారాయ్, ధరణి బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు.

ఎంపికైన విద్యార్థులతో గురుచంద్రశేఖర్

జగన్‌లో ఓటమి భయం

- ప్రజాగ్రహం తప్పదని గ్రహించి స్వరం మార్చాడు
- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్వరం మారుతోందని, గతంలో ఉన్న ధైర్యం, నమ్మకం పూర్తిగా సన్నగిల్లినట్లు తాజాగా ఆయన మాటల్ని బట్టి తెలుస్తోందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2021లో ఎవరినీ లెక్క చేయకుండా అహంకారంతో విర్రవీగిన ముఖ్యమంత్రి, ఒకానొక సందర్భంలో 'నా వెంట్రుక కూడా పీకలేరు' అన్న విషయం ప్రజలు గుర్తించాలని, అదే వ్యక్తి ఇప్పుడు పీకేసినా పర్వాలేదు అంటున్నాడని ఎద్దేవా చేశారు. 2022లో నమ్మాలని ప్రజల్ని వేడుకునే పరిస్థితికి వచ్చారని, 2023 వచ్చే సరికి మరింత దిగజారి మిమ్మల్నే నమ్ముకున్నాననే దీనావస్థకు వచ్చారని అన్నారు. ఇప్పుడు ఏకంగా ప్రజలు ఇక వైసిపి ప్రభుత్వాన్ని నమ్మడం లేదని గ్రహించి, చివరకు ఓడిపోయినా పరవాలేదని, సంతోషంగా దిగిపోతానన్నడం ఆయనలో పరాకాష్టకు చేరిన ఓటమి భయానికి నిదర్శనమని అన్నారు. ప్రజాగ్రహం చవిచూడాల్సి వస్తుందన్న భయంతోనే జగన్‌రెడ్డి అనేక రకాలుగా అప్రజాస్వామిక విధానాలకు పాల్పడుతున్నారని తెలిపారు. జగన్ అక్రమాల కారణంగానే ఈ ఏడాది జనవరి 5న రావాల్సిన ఓటర్ జాబితా 22న విడుదలైందని, జాబితాలో ప్రభుత్వం అనేక అవకతవకలకు, అక్రమాలకు పాల్పడిందనేది వాస్తవమన్నారు. ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారన్న భయంతోనే జగన్‌రెడ్డి చివరకు దొంగ ఓట్లను నమ్ముకునే దుస్థితికి దిగజారాడని విమర్శించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని ఆర్‌సిఎం ఉన్నత పాఠశాలలో 2002-03 పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కర్నూలు, కడప, అనంతపురం, హైదరాబాదు, బెంగుళూరు, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 45 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. 21 సంవత్సరాల తరువాత ఒకరినొకరు పలకరించుకొని ఆనందంతో పులకించి పోయారు. నాటి జ్ఞాపకాలు, ఆనందాన్ని పంచుకున్నారు. జీవితంలో సాధించిన విజయాలు, కష్టాల గురించి చర్చించుకున్నారు. అనంతరం పాదర్ ప్రకాష్, అప్పటి పాఠశాల హెచ్ఎం భాస్కరెడ్డి, పూర్వ ఉపాధ్యాయులు మౌళి, రాజ్‌కుమార్ రెడ్డి, గౌస్, జీవరత్నంలకు మెమెంటోలు అందజేసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుధాకర్, బాలు, రాజేష్, ఓబులేష్, హుసేన్ భాష, నూర్‌బాషా, నగేష్, దస్తగిరి, మంజుల, సుమలత, మధులత, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

వైసిపిలోకి ఎంఐఎం కార్యకర్తలు చేరిక

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డుకు చెందిన ఎంఐఎం కార్యకర్తలు ఫారుక్, చాంద్ భాష, సయ్యద్ భాష, హుస్సేన్, హఫీజ్, రియాజ్, అల్తాఫ్, సలాం, ముర్తుజావలి, గౌండ అయూబ్, సైఫుల్లా,షరీఫ్, మాభాష, మూర్తుజా తదితరులు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సమక్షంలో వైసిపిలో ఆదివారం చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తువ్వా శివరామకృష్ణా రెడ్డి, పట్టణ అధ్యక్షులు మన్సూర్, ఉపాధ్యక్షులు చింతా విజ్జి, మాజీ కో ఆప్షన్ సభ్యులు జబ్బార్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఉస్మాన్ బేగ్, మైనారిటీ జోనల్ ఇంఛార్జి అబూబక్కర్, లాయర్ నజీర్ అహ్మద్, ఆర్.టి.సి బాబు, వార్డు ఇంచార్జ్ శాలి భాష, నియోజకవర్గ ఎన్‌సి సెల్ బొల్లెద్దుల రామకృష్ణ, కౌన్సిలర్లు నాయబ్, అల్లూరి క్రిష్ణ, చాంద్‌బాషా, లాలు ప్రసాద్, సనా అబ్దుల్లా, మార్కెట్ రాజు, పట్టణ యూత్ వింగ్ ప్రెసిడెంట్ లడ్డూ, పి.రమేష్, ముచ్చుమర్రి బాష తదితరులు పాల్గొన్నారు.

చెరువుపల్లెలో రూ. 2 కోట్ల అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని చెరువుపల్లె గ్రామంలో రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు ఎమ్మెల్యే కాటసాని రామి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చెరువు పల్లె గ్రామంలో రూ. 28 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు, రూ. 7 లక్షలు ఎంపీ నిధులతో నిర్మించిన పంపింగ్ మెయిన్ లైను, రూ. 15 లక్షలతో నిర్మించిన డిస్ట్రిబ్యూషన్ లైన్, రూ. 15 లక్షలతో మరో ఓవర్ హెడ్ ట్యాంకు ఆధునీకరణ, రూ. 45 లక్షలతో సిసి రోడ్లు, రూ. 43 లక్షల 60 వేలతో గ్రామ సచివాలయ భవనం, రూ. 20 లక్షల 80వేలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ గ్రామానికి గతంలో మంచినీటి సమస్య చాలా ఎక్కువగా ఉండేదని, నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహాయ సహకారాలతో రూ. 65 లక్షలతో మంచినీటి శాశ్వత పరిష్కారం చేశామన్నారు. నిత్యం ప్రజల కోసం కష్టపడే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని 2024 సంవత్సరంలో మళ్ళీ ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య, పంచాయతీరాజ్ ఏఈ మహేష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, వైసిపి మండల పార్టీ కన్వీనర్ పసుపల జనార్దన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ హుస్సేన్ బి, వైసిపి నాయకులు పుల్లయ్య, గడ్డల భాష, రామసుబ్బయ్య గౌడ్, నాగయ్య యాదవ్, సూర్యనారాయణ రెడ్డి, భూపాల్, డీలర్ నాగరాజు, రామతీర్థం సర్పంచి సురేష్ నాయుడు, రామకృష్ణాపురం నాగేంద్ర, పలుకూరు బాలుడు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి తదితరులు

విద్యార్థులు ఉన్నతంగా ఎదగడమే నిజమైన ఆనందం

- పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - బేతంచెర్ల

నాడు తాము బోధించిన విద్యతో విద్యార్థులు నేడు ఎన్నో ఉన్నత స్థానాల్లో స్థిరపడినందుకు ఎంతగానో ఆనందంగా ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. స్థానిక శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. తమకు విద్య బోధించిన గురువులను ఆహ్వానించి దుశ్శాలువాలు, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నాగభూషణం, రామశర్మ, ఆదినారాయణ, వెంకట్రావు, తిరుపాలయ్య, మల్లికార్జున, ఉర్దూ హాజీ మాట్లాడుతూ చంద్రయాన్-3లో తమ విద్యార్థి సలీం పని చేయడం అభినందనీయమన్నారు. అంతకుముందు 1994-95 బ్యాచ్‌లో టాపర్‌గా నిలిచిన కృష్ణవేణితో పాటు విద్యను బోధించి మరణించిన ఉపాధ్యాయుల కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం హాజరైన ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థులు జ్ఞాపకార్థం అందించిన ఉపాధ్యాయుల దంపతుల ఫొటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సబ్ ఇంజనీర్ బ్రహ్మానంద రెడ్డి, జనార్దన్, వీరాంజనేయులు, శివ శంకర్, రవి, అనుముల శంకర్, సతీష్, నాగేశ్వర్ రెడ్డి, భాస్కర్, వెంకట్, విష్ణు, కోటపేట కాజా, జవాజి నామం వెంకటేశ్వర్లు, ఎలక్ట్రికల్ రేగుమన సుబ్బయ్య, పిక్కిలి శ్రీనివాసులు, గణేష్, మహేశ్వర్ రెడ్డి, చిన్న రాజు, మహిళలు ఏఎన్ఎం మహేశ్వరి, పద్మావతి, సుశీలమ్మ, రాధా, రాణి, నాగలక్ష్మి, ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

జగన్ రెడ్డిని ఓడించేందుకు జనం సిద్ధం

- డోన్ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-డోన్

వైసిపి ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలైందని, ఇక మిగిలింది 74రోజులు మాత్రమేనని డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం డోన్ టిడిపి కార్యాలయంలో క్లస్టర్ ఇంచార్జ్ చాటకొండ శ్రీనివాసులు , క్లస్టర్ ఇంచార్జ్ గంధం శ్రీనివాసులు క్లస్టర్ పరిధిలోని యూనిట్ ఇంచార్జులు, బూత్ ఇంచార్జులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఓటరులిస్టు వెరిఫికేషన్, గృహసారథులు, పోల్‌మేనేజ్‌మెంట్, టిడిపి భవిష్యత్తు కార్యాచరణ అంశాలను ప్రత్యేక శిక్షకులు వివరించారు. ధర్మవరం మన్నెసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు తాము సిద్ధమని జగన్ రెడ్డి, వైసిపి నేతలు చెబుతుంటే మరోవైపు ప్రజలు కూడా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. జగన్ రెడ్డి అహంకారానికి, వైసిపి అరాచక పాలన సృష్టి పలకడానికి రైతులు, యువత, ఉద్యోగాలు అంతా సిద్ధమయ్యారని అన్నారు. ఆంధ్రరాష్ట్రన్ని నాశనం చేసిన ఈ ప్రభుత్వం ప్రజలకు అవసరం లేదని, గత ఐదేళ్ల పాలనలో వైసిపి ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తచేయలేదన్నారు. అదే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చుంటే సాగునీటి ప్రాజెక్టులు పూర్తయ్యేవని అన్నారు. ఒకప్పుడు రూ.200 విద్యుత్ బిల్లు ఇప్పుడు 5రేట్లు పెరిగి రూ.1000 చేరిందని అన్నారు.టిటిపి హయాములో ఉచితంగా దొరికే ఇసుక ఇపుడు సామాన్యునికి అందినంత ధరకు చేరిందని అన్నారు. అసమర్థ పాలన వలన అప్పులు పెరిగి ,వాటికి వడ్డీలు భారీగా పెరిగి ఆ భారం ప్రజలపై పడుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేయ్యాలని అన్నారు. యూనిట్ ఇంచార్జ్ సిటీకేబుల్ కిరణ్, యూనిట్ ఇంచార్జ్ నీలం ప్రభాకర్, యూనిట్ ఇంచార్జ్ అలీబాబా, యూనిట్ ఇంచార్జ్ ధను, యూనిట్ ఇంచార్జ్ వీరాంజి, బూత్ ఇంచార్జులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డోన్ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి

టిడిపిలోనే బిసిలకు రాజకీయ ప్రాధాన్యత

- రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందు నాయుడు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

టిడిపి పాలనలోనే బిసిలకు రాజకీయ ప్రాధాన్యత ఉంటుందని, బిసిలు కలిసికట్టుగా పార్టీని అధికారంలోఇ తీసుకొస్తే బిసిలకు సముచిత స్థానం దక్కుతుందని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందు నాయుడు తెలిపారు. ఆదివారం కొలిమిగుండ్లలోని సాయిబాబా ఆడిటోరియల్‌లో జయహో బిసి కార్యక్రమాన్ని టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పసుపల బాలనాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపిని స్థాపించిన తర్వాత ఎన్టీఆర్ బిసిలకు రాజకీయంగా పదవులను ఇచ్చి గుర్తింపు తెచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బిసిల కోసమని 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి రాజకీయ నిరుద్యోగులకు పదవులను ఇచ్చారే తప్ప ఒక్క పైసా నిధులు కూడా కేటాయించలేదని విమర్శించారు. టిడిపి పాలనలో బిసిలకు 37 శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పిస్తే సిఎం జగన్మోహన్ రెడ్డి 24 శాతానికి కుదించారని అన్నారు. వైసిపి పాలనలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. సైకో ముఖ్యమంత్రిని సాగనంపి పేద ప్రజల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం పనిచేసే తెలుగుదేశం పార్టీని అధికారంలోనికి తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కో కన్వీనర్ వడ్డే తిరుపాలు, రాష్ట్ర బెస్త సాధికార కార్యదర్శి బెస్త అరుణ్ కుమార్, కురువ రాష్ట్ర కన్వీనర్ మహానంది, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నడిపి భూషన్న, వడ్డెర సాధికార జిల్లా కన్వీనర్ సుబ్బరాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు ఎం రామేశ్వర్ రెడ్డి, ఐవి పక్కీరా రెడ్డి, ఏఆర్ లక్ష్మిరెడ్డి, ఎం.శివరాంరెడ్డి, బిసి, వాల్మీకి సంఘం నాయకులు హుస్సేనయ్య, తెలుగు యువత మండల కార్యదర్శి నంద్యాల ప్రసాద్ యాదవ్, మధు, గోపాలు, సర్పంచ్ శివశంకర్, విజయ్ గోపాల్, కేపీ వెంకటేశ్వర్లు, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందు నాయుడు

జయహో బిసి కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు